

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 | సంచిక : 24 | పుష్పం : 66-68 | 05-09-2002

**RAMANA BHASKARA**
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE
PAGES : 20
VOL : 7 ISSUE : 24

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## రూప సంకటాలను రూపుమాపితే, రూపాతీతస్థితికి వెళ్ళే మార్గం రూపుదిద్దుకుంటుంది

ఆత్మకు రూప-నామ-క్రియలు లేవు. మనం అదే కాబట్టి వాటిని మైనస్ చేస్తే సృష్టేలేదు. సృష్టేలేనప్పుడు రాగం ఎక్కడ? ద్వేషం ఎక్కడ? కాని కొన్నివేలజన్మలనుంచి మనం మనో పరిధిలోనే జీవిస్తున్నాము. ఈ మనస్సుకు రూపం అంటే బహు ఇష్టం - కారణం అది రూపంతోనే పుట్టింది. రూపాన్ని నమిలిమింగి జీర్ణించుకొని వృద్ధి చెందింది. ఒక రూపాన్ని విడిచి మరో రూపాన్ని పట్టుకొంటుంది. నిజవిచారణ చేస్తే పారిపోతుంది ఈ అహంకార పిశాచం. ఈ సురూపాలు, ఈ కురూపాలు ఆ లీలామానుషమూర్తి వేసుకొనే వేషాలే అని తెలియక కట్టుబాటు లేకుండా ఈ ప్రకృతి రూపాలైన, పాలరాతిభవనాలు, పట్టుబట్టలు, నగలు, పసిడిఛాయగల దేహాలకోసం పిచ్చి పరుగులు తీస్తుంది. వివాహ వ్యవస్థకు అగ్రపీఠం వహించేది ఈ దృష్టిచాపల్యమే.

**ఈ సంచికలో......** *సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు*

24-02-2002 జిన్నూరు ........ 3
18-08-2002 హైదరాబాద్ ........ 7
30-08-2002 జిన్నూరు ........ 15

Visit us @ www.srinannagaru.com

రూపాలరొంపిలో కూరుకుపోయిన మనం, రూపాతీత స్థితిని ఊహించుకోలేకపోతున్నాము. మూలాధారాన్ని మరిచి శరీరమనే నీడలను పట్టుకొంటున్నాము. సుందరమైన మనోహరమైన దేహం మనదైనా, యితరులదైనా "మాయ"లో పడకూడదు. ఎఱ్ఱగా ఉన్నా, నల్లగా ఉన్నా అన్నీ మట్టిబొమ్మలే అనే స్ఫురణ నిరంతరం కలగాలి. ఈ శరీరం ఒక గుడ్డలాంటిది ఇక్కడే పొందాము ఇక్కడే వదలాలి. మనం సర్వోత్తమమైన ప్రేమను, ప్రీతిని పెంపొందించుకోవాలి. పంచభూత నిర్మితమైన ఈ ప్రపంచాన్ని, యథాతథంగా చూస్తే నిజానికి ఎటువంటి విలువలేదు. ఎముకలు, మాంసం, నాడులు, మలమూత్రాలతో ఈ దేహాలు నిండిఉన్నాయి. కాని మన ఇష్టా, అయిష్టాలు, రాగద్వేషాలు ఆ వస్తువులకు, ఆశరీరాలకు ఆవరించి వాటికి లేని విలువలను వాటికి ఆపాదించుకొని తన ఉనికిని నిలబెట్టుకొంటున్నాయి. ఈ కల్పిత మానసిక విలువలతో ఆ వస్తువులను సంపాదించుకోవటానికి ఎల్లప్పడు శ్రమపడుతూ భాదామయ సంసారంలో చిక్కుకుపోతున్నాము. ఉదాసీనభావం వృద్ధిచేసుకొంటే కోరికలు నశిస్తాయి. ఉదాసీనమే దానికి మందు. వాసన బలంగా ఉంటే మన జుట్టుపట్టుకొని ఈ దృశ్యాన్ని చూడు అంటుంది. బహుజన్మల కృషిలేకపోతే మన హృదయంలో ఉన్న ఈ బండరాళ్ళను తొలగించుకోలేము. అది స్వప్రయత్నానికి సాధ్యంకాకపోతే దానికి విరుగుడు ఒక్కటే, "గురువు లేదా ఇష్ట దేవతా పాదపీఠంపై అచంచలమైన భక్తితో ప్రయత్నపూర్వకంగా దృష్టిని నిలిపి ప్రార్థించటమే ఏకైక పరిష్కారము". సాధకునకు శీల నిర్మాణం, హృదయ శుద్ధి ముఖ్యము, అత్యవసరం. భోగకాంక్ష ఉంటే మోక్ష మార్గానికి దూరమైపోతాము. సంసార బుద్ధిని సారథిగా పెట్టుకొంటే సంతాపం తప్పదు. నిజం తెలియనంతకాలం అది నిజంలాగే కనిపిస్తుంది. నేను ఒకడను, ఇతడు నాకంటే వేరు అనే వాసన ఆత్మబుద్ధిలేని మూర్ఖులనే జయిస్తుంది. ఆత్మవంచనకు ఎప్పడు అవకాశం ఇస్తామో అప్పడే తక్కిన అన్ని వంచనలు ఒకదానివెంట ఒకటి నైజంగా బయలుదేరతాయి. అలవాట్లే పొరపాట్ల క్రిందకు వస్తాయి. ప్రమాదానికి దారి తీస్తాయి. "మాయ"తో పోరాడాలి అంటే శాంతచిత్తం కావాలి. మనం ఈశ్వరుణ్ణి విశ్వసించక, ఆయన మాయను విశ్వసిస్తున్నాము. ఆ మాయను మాయ చెయ్యాలి అంటే, దృశ్యాన్ని చూడకుండా ఉండటం సాధ్యంకాదు కాబట్టి భగవంతుణ్ణి కలిపి చూడటం నేర్చుకుంటే దృశ్యం బంధించదు. దీనికి అభ్యాస, వైరాగ్యాలు ఎంతో కావాలి. అది ఉంటే అసాధ్యమనుకున్నది సుసాధ్యమవుతుంది, శివరూపాన్ని పొందుతాము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-02-2002, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రామనామము లక్ష్మీప్రదమైనది. రాముని రూపంకంటే రామనామం గొప్పది అని చెపుతారు. శ్రీరామచంద్రమూర్తిని మర్యాదపురుషోత్తముడు అంటారు. ఎవరైనా తెలిసినవారు కనిపిస్తే ముందుగా ఆయనే ప్రేమతో పలకరించేవాడట, ఆయనకు ఎవరైనా ఎదురు వస్తూ ఉంటే ముందు ఆయనే ప్రక్కకు ఒదిగేవాడట. ఆయన స్వయంగా చక్రవర్తి, ఒక మహారాజు కుమారుడు, ఇంకో మహారాజుకు అల్లుడు అయినప్పటికి ఆయనలో ఎంతో వినయం మనకు కనబడుతుంది. వినయం అనేది ఆయనను చూసి మనం నేర్చుకోవాలి. రామాయణం అంతా ప్రేమమయం. సర్వసాధారణంగా అన్నదమ్ములు ఆస్తులకోసం పేచీలు పడతారు కాని ఆస్తులు నాకువద్దు అంటే నాకువద్దనే అన్నదమ్ములు రామాయణంలోనే కనబడతారు, రాముడి అన్నదమ్ములకు అది సరిపోయింది. మనకు తెలివితేటలు ఎప్పుడూ సమానంగా ఉండవు. తెలివితేటలు తక్కువగా ఉన్నప్పుడు ఉద్రేకంగా మాట్లాడతాము. గుణాతీతుడికి కూడా గుణాల వలన వచ్చే తలంపులు రావచ్చు, వచ్చినా అవి వాడి మనస్సును గాయం చెయ్యవు. కొంతమందికి త్యాగబుద్ధి ఉంటుంది గాని స్వయంగా బాధలు భరించలేరు, రాముడికి త్యాగబుద్ధి ఉంది, బాధలను కూడా ప్రశాంతంగా భరించగలడు. రామచంద్రమూర్తి వాలితో చెపుతాడు నీవు కారణంలేకుండా సుగ్రీవుడిని బాధించావు, రాజ్యంలోనుండి తరిమేసావు, కాని నీవు నా చేత చంపబడటంవలన నీ బుద్ధిలో ఉన్న దోషాలు అన్నీ పోయాయి, నీ బుద్ధి శుద్ధి అయ్యింది, వైకుంఠానికి వెళ్ళిపోతున్నావు, ఇంకేమి కావాలి వాలీ , నీకు దు:ఖం వద్దు, మోహం వద్దు అని వాలితో రామచంద్రమూర్తి చెపుతాడు. దేహప్రారబ్ధమును ఇష్టముతో అనుభవించండి, ఇష్టముతో ప్రారబ్దమును అనుభవించటం వలన పునర్జన్మ హేతువులు అన్నీ కాలిబూడిద అవుతాయి.

రామనామం స్మరించటం వలన బుద్ధిలో ఉన్న దోషాలు అన్నీపోయి మనం పవిత్రులమవుతాము. మనలను ఎవరైనా చంపటానికి వస్తే వెర్రికేకలు వేస్తాము కాని గాంధీజీని తుపాకీతో కాల్చినప్పడు హేరామ్, హేరామ్ అంటూ చివరిశ్వాస విడిచారు. ఆయన భక్తుడు. నేను పిల్లవాడిగా ఉన్నప్పడు నాకు భయం చాలా ఎక్కువగా ఉండేది కాని రామనామం





స్మరించి స్మరించి భయరహితుడను అయ్యాను అని గాంధీజీ చెప్పారు. జపధ్యానములు చేసుకొనే ఋషులను రాక్షసులు బాధపెడుతూ ఉంటే వారు వచ్చి, రాముడికి చెపుతారు. మిమ్మల్ని ఎవరైతే బాధపెడుతున్నారో వారిని సంహరిస్తాను అని రాముడు చెపుతాడు. వారి గొడవ మనకు ఎందుకు అని సీత రాముడితో అంటుంది. అయితే మనం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చినట్లు, మనం రాక్షస సంహారం కోసం ఈ భూమి మీదకు వచ్చాము అది మర్చిపోవద్దు అన్నాడు రాముడు. రాముడు పైకి అతిసామాన్యుడిలా కనబడతాడు, కాని లోపల అతిబలవంతుడు. మనం కుటుంబంలో ఎలావ్యవహరించాలి, సోదరులు ఎలా ఉండాలి అనేది మనకు రామాయణంలో కనబడుతుంది. మనం అన్నదానం చేయవచ్చు, వస్త్రదానం చేయవచ్చు, విద్యాదానం చేయవచ్చు కాని లోపలనుండి ఆత్మజ్ఞానం సముపార్జించాలి అనే కాంక్షను కలుగజేయటం అన్ని దానాలలోనికి గొప్పది, అది ఒక్క జ్ఞానికే సాధ్యం. మనం నిర్మలంగా, నిశ్చలంగా, నిరహంకారముగా ఒక మంచిపని చేస్తే దాని ఫలితం ఏదో రోజు వస్తుంది. మీరు చేసి మర్చిపోండి కాని దేవుడు మర్చిపోడు. ఆ ఫలం ఏదో రోజు ఇస్తాడు. మీరు చేసే పని మాత్రం నిర్మలంగా చేయండి, సాత్విక బుద్ధితో చేయండి, రజోగుణంతో, తమోగుణంతో చేయవద్దు. మనం ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాము. మనం వైశ్యులమని, మనం రాజులమని, ఇండియా వారమని, అమెరికా వారమని ఇలా ఏదో ఒకటి అనుకొంటూ హద్దులు పెట్టుకొని, మనస్సులో వికారములు పెట్టుకొని పతనమవుతున్నాము. మనం చైతన్య స్వరూపులమనే గ్రహింపు మనకు రావటంలేదు. మనకు ఒక మంచిఆలోచన వచ్చింది అనుకోండి, ఒక మంచి తలంపువచ్చింది అనుకోండి దానిని ఆచరణలో పెట్టలేకపోతూఉంటే నీ బుద్ధిలో దోషం ఉంది అని గుర్తు. ఆ దోషాన్ని కాల్చి బూడిద చేయటానికి, నిన్ను పవిత్రుడిని చేయటానికి రామనామం నీకు సహకరిస్తుంది.

దైవీసంపద లేకపోతే, లోపల వైరాగ్యబలంలేకపోతే, వికాశం లేకపోతే, లోపల ప్రిపరేషన్ లేకపోతే ఆత్మజ్ఞానం కావాలి అంటే అంత తేలికగా వస్తుందా? ముందు దైవీగుణాలను సంపాదించాలి కదా అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నం చేస్తూ ఉంటే కళ్యాణగుణాలు అన్నీ నీకూడా వస్తాయి అంటున్నారు భగవాన్. నీవు వాటిని ప్రత్యేకంగా సంపాదించనక్కరలేదు. ఆత్మజ్ఞానసముపార్జనలోనే సద్గుణాలు అన్నీ సహజంగా వచ్చేస్తాయి. దేహమునేను అనే సంకల్పమే పాపము అన్నాడు యేసు. దేహము నీవు కాదు. నీవు కానిదానిని నీవు అనుకొంటున్నావు, అక్కడ నుండే పాపం ప్రారంభమవుతోంది.

కొంతమందికి ఈ నేను దేహం దగ్గర, కొంతమందికి మనస్సు దగ్గర, కొంతమందికి బుద్ధి దగ్గర ఆగిపోతుంది. ఈ దేహంలోనుండి, మనస్సులోనుండి, బుద్ధిలోనుండి విడుదల పొందితే గాని నీవు ఎవరో నీకు తెలియదు. ఈ నేను దేనితో తాదాప్యం పొందుతోందో వాటిలోనుండి విడుదల పొందటమే జ్ఞానం. సోమరితనం పనికిరాదు, సోమరితనం ఉన్నవాడు దేనికి పనికిరాడు. సోమరితనం ఉన్నవాడికి ఆత్మచింతన ఉండదు, విషయచింతనకు అలవాటు పడతాడు, అజ్ఞానంలో కూరుకొని పోతాడు. కొంతమందికి ఇంటిలో సంపద ఉన్నా మనస్సులో సంపద ఉండదు, మనస్సులో సంపద ఉండాలి. రామాయణంలో వాల్మీకి చెపుతాడు పాము నోటిలో ఉన్న విషం కంటే రాగద్వేషములు ప్రమాదకరమైనవి. పాము కరిస్తే ఆవిషం వలన ఈదేహం చనిపోతుంది కాని రాగద్వేషములలో ఉన్న విషం లక్షలాది జన్మలు తీసుకొని వస్తుంది, మరణానంతర జీవితం చీకటిమయం అవుతుంది. మనకు అహంభావన వేరుతో సహా నశించినప్పుడు సృష్టితో సన్నిహితసంబంధం ఏర్పడుతుంది. జ్ఞాని దేహం ఉండగానే సృష్టిని కౌగిలించుకొంటాడు. మన తల్లితండ్రులుగాని, బంధువులుగాని, స్నేహితులుగాని చూపలేనిప్రేమ జ్ఞాని నుండి ప్రవహిస్తుంది. తల్లితండ్రులు తిండి, బట్ట ఇస్తారు కాని ఒక్క జ్ఞాని మాత్రమే మనకు జ్ఞానాన్ని ఇవ్వగలడు. ఈ మధ్య ఒక తండ్రి కొడుకుకు ఏవో గొడవలు వచ్చాయి, విడిపోయారు. ఒక సందర్భంలో ఆ తండ్రి కొడుకుగురించి చెపుతూ వాడు చనిపోలేదు, వాడు బ్రతికే ఉన్నాడు అయినా వాడు మనవాడు కాదు కదా అన్నారు. అంటే వాడుఉన్నా మనకు ఏమీ ప్రయోజనం లేదు కదా అని. అలాగే నీకు మంచితనం ఉంది అనుకో, తెలివి ఉంది అనుకో, భక్తి ఉంది అనుకో ఇవి అన్నీ అహంభావనలో నుండి విడుదల పొందటానికి నీకు సహకరించకపోతే వాటివలన ప్రయోజనం ఏమి ఉంది? నీవు అహంభావనలోనుండి విడుదల పొందాలి కదా? అసలు కావలసింది అదే కదా,

వారు అలా అంటే బాగుండును, వీరుఇలా ఉంటే బాగుండును, వారు మారితే బాగుండును అని ఆలోచించుకొనే బదులు మనం మారటానికి ప్రయత్నం చేసుకొంటే వారితో సర్దుకొని ఈ లోకంనుండి బయటకు పోవచ్చును. అరణ్యవాసంలో రాముడు లక్ష్మణుడితో పర్ణశాల నిర్మించమని చెపితే, పలానా చోట నిర్మించమని చెపితో అక్కడ నిర్మిస్తాను అంతే గాని అప్పడే నన్ను పెద్దవాడిని చెయ్యవద్దు అంటాడు లక్ష్మణుడు. కాని మనకు పెద్దరికం కావాలి. మన చేతలో కపటం, మాటలో కపటం, లోపలఅంతా కపటం. ఇంక మనకు ఎవరు పెద్దరికం ఇస్తారు? మనం మంచివారము అనుకోకూడదు, చెడ్డవారము అనుకోకూడదు, మనగురించి మనం ఏమీ అనుకోకుండా ఉంటే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది., ఏదోఒకటి అనుకోవటం వలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది, ఆత్మజ్ఞానానికి దూరమవుతున్నాము. మన అజ్ఞానం ఏదోఒకటి అనుకోకుండా మనలను ఉండనివ్వదు. ఏది ఎలా జరగాలో అది అలా జరుగుతుంది. దాని గురించి ఆలోచించి నీ బుద్ధిని పాడుచేసుకోవద్దు. మన ఇష్టాలను ప్రక్కన పెట్టి భగవంతుడు చెప్పినట్లు నడుచుకొంటే జ్ఞానమును పొందవచ్చు. ఈశ్వరుడిని అది కావాలి, ఇది కావాలి అని అడిగితే శరణాగతి రాదు. కోరికలు లేకపోతే నీ శరణాగతి ఆరోజుకారోజు పరిపూర్ణమవుతుంది. శరణాగతి ఎప్పడైతే పరిపూర్ణమయ్యిందో అహంభావన వేరుతో సహా నశిస్తుంది, అప్పడు నారాయణుడు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి, భగవంతుడిమీద భారంవేసి సాధనచేస్తూఉంటే మనోమూలంలోనికి వెళ్ళవచ్చు. మనోమూలంలోనికి వెళ్ళి అక్కడ ఉండగలిగితే మనస్సు నశిస్తుంది. అప్పడు మనం ఎవరో మనకు తెలుస్తుంది, అదే జ్ఞానం. మీ మనస్సులో ఉన్న చేదును తొలగించుకొని, తియ్యదనం పట్టించుకొంటే రాముడిని దర్శించవచ్చు. మీరు నన్ను ఎలాచూస్తున్నారో, నేను మిమ్మల్ని ఎలాచూస్తున్నానో అలాగ రామచంద్రమూర్తిని ఫిజికల్‌గా కూడా దర్శించవచ్చు.

ఈమధ్య మారోజులు బాగాలేవు, కర్మ అనుభవిస్తున్నాము అని చాలామంది అంటారు. భగవాన్‌ఏమంటున్నారు అంటే నీలోపలఉన్న చైతన్యం ఏమీ కర్మ అనుభవించదు. నీ అహంభావనే కర్మ అనుభవిస్తుంది. అహంభావనలోనుండి బయటకు వచ్చేసావు అనుకో కర్మ ఏమి చేస్తుంది, కర్మ ఏమీ నిన్ను అంటదు. అహంభావనలో నుండి విడుదలపొందితే నీకు బండెడు దు:ఖం ఉన్నా అదిఅంతా సుఖంగా మారిపోతుంది. అది జ్ఞానం యొక్క వైభవం. దేహం ఉన్నవాడికి జబ్బు గాని, దేహంలేనివాడికి జబ్బు ఏమిటి? మనస్సు ఉన్నవాడికి బెంగ కాని మనస్సు లేనివాడికి బెంగఏమిటి? అహంభావన ఉన్నవాడు కర్మ అనుభవిస్తున్నాను అనుకొంటాడు, అహంభావనలో నుండి విడుదల పొందినవాడికి ఇంక కర్మ అనుభవించటానికి అక్కడ ఎవడైనా ఉంటేకదా, అహంభావన తొలగి నీలోజ్ఞానతేజస్సు ఉదయిస్తే, ఆ జ్ఞానాగ్నిలో ఎంతకర్మ ఉన్నా కాలిబూడిద అయిపోతుంది. నీవు ఏమార్గంలో సాధనచేసినా శ్రద్ద అవసరం. నీవుచేసే మార్గంలో ఏకాగ్రత అవసరం, ప్రేమ అవసరం, తరించాలనే కాంక్ష అవసరం. అంతశ్రద్ధగా చేస్తే ఆత్మజ్ఞానం సాధ్యమే, ఇందులో సందేహం లేదు. ఆత్మజ్ఞాన సముపార్జనలోనే నీలోని అజ్ఞానం బస్మమవుతూఉంటుంది.

**05-09-2002**

**రమణ భాస్కర**

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-08-2002, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉపదేశం చెప్పమని ఎవరైనా భగవాన్‌ను అడిగితే ఉపదేశం ఉపదేశసారంలో ఉంది అని అంటూ ఉండేవారు. అంటే ఉపదేశసారానికి అంత ప్రాముఖ్యత ఉంది. ఉపదేశసారం, నేను ఎవడను, ఉన్నది నలుబది సద్విద్య, అక్షరమణమాల ఇవి అన్నీ అనుదినం పారాయణ చేయవలసిన గ్రంధాలు. మనకు దేహము నేను అనే తలంపు ఉంది. అది మూలతలంపు. మనకు ఏ తలంపు వచ్చినా మంచితలంపులు వచ్చినా, చెడుతలంపులు వచ్చినా దేహము నేను అనే తలంపు మీదే ఆధారపడి ప్రతీతలంపు వస్తుంది. చెడుతలంపులు వచ్చినప్పుడు వాటిని అణిచివేయటానికి చూస్తారు. అలా అణచివేయటం కంటే వాటిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి. మనకు వచ్చే తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనకు అన్ని వైపుల నుండి మంచితలంపులు వచ్చేటట్లు ఈశ్వరుడిని ప్రార్థించాలి. మంచితలంపులువస్తే మంచిమాటలు మాట్లాడతాము, మంచిపనులు చేస్తాము, ఇతరుల క్షేమం గురించి ఆలోచిస్తాము. మంచితనం మంచిదే కాని నేను మంచివాడిని అనుకోవటం వలన ప్రమాదంలో పడతావు. మంచితనంతో తాదాప్యం చెందితే ఎవరైనా నిన్ను చెడ్డవాడు అంటే వెంటనే డిప్రెషన్ వచ్చేస్తుంది, అధ్యాత్మికఅభివృద్ధి ఆగిపోతుంది, చివరకు వాడి మంచితనమే ఆత్మజ్ఞానం పొందటానికి అవరోధం అవుతుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి. బ్రహ్మం మన హృదయంలో ఉంది. దానికి చావులేదు, పుట్టుక లేదు, అది గుణాతీతమైనది. శరీరం పుడుతుంది, మరణిస్తుంది, మనస్సులో మంచి చెడు గుణాలు ఉన్నాయి. నీ హృదయంలో ఉన్న బ్రహ్మానికి నీ శరీరానికి వచ్చే వికారములతో గాని, నీ మనస్సులో ఉన్న గుణాలతో గాని ఎట్టి సంబంధంలేదు, అది మనమై ఉన్నాము. ఇప్పుడు మనం దేహంతో, మనస్సుతో ఎలా తాదాప్యం పొందుతున్నామో అలాగ హృదయంలో ఉన్న బ్రహ్మంతో తాదాప్యం పొందగలిగితే అది మనకు అనుభవంలోనికి వస్తుంది. దాని తాలూకు ఎఱుకలో మనం ఉండగలుగుతాము. దేహము నేను అనే తలంపు నీకు తెలుస్తోంది గాని అది ఎక్కడ నుండి వస్తోందో నీకు తెలియటం లేదు. ఈ మూలతలంపును ఉపసంహరించి దాని మూలంలోనికి పంపగలిగితే, అక్కడ ఉంచగలిగితే అప్పుడు మూలతలంపు నశిస్తుంది. అప్పుడు నిజమైన నేను నీకు తానుగా వ్యక్తమవుతుంది. అది దేహానికి పరిమితమై ఉండదు. దేహగతమైన నేనులో నుండి విడుదల పొందలేకపోతే నీకు నిజమైన నేను ఎఱుకలోనికి రాదు. హృదయంలో ఉన్న బ్రహ్మంను విడిచిపెట్టి అక్కడ దేవుడు ఉన్నాడు, ఇక్కడ దేవుడు ఉన్నాడు అని వెదకటం ప్రారంభిస్తే నీ చేతిలో ఉన్న బంగారాన్ని వదిలేసి రోడ్డుమీద ఉన్న పెంకుముక్కలను ఏరుకున్నట్లుగా ఉంటుంది. నీవు తెలుసుకోవలసిన వస్తువు నీలోపలే ఉంది, అంతే కాదు అది నీవై ఉన్నావు. దానిని తెలుసుకొనేవరకు నీకు బంధం తప్పదు. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి మనకు వైరాగ్యం అవసరం, అభ్యాసం అవసరం. భగవంతుడు తప్పించి బాహ్యంగా మనకు ఏ వస్తువు మీద అయినా కోరిక కలుగుతూ ఉంటే, మన మనస్సు అక్కడ వాలుతూ ఉంటే మనకు వైరాగ్యం లేనట్లు గుర్తు. మనస్సు బాహ్యముఖానికి వెళ్ళకుండా వైరాగ్యం ఆపుచేస్తుంది. మనస్సు దాని మూలంలోనికి వెళ్ళటానికి అభ్యాసం సహకరిస్తుంది. మనస్సును నియమించుకోవటానికి, మనస్సుకు అంతర్‌దృష్టి కలగటానికి వైరాగ్యం, అభ్యాసం అవసరమే, సత్పురుషుల సహవాసం అవసరమే. మనకు పూర్వ పుణ్యం లేకపోతే సత్పురుషుల సహవాసం చేయాలనే తలంపేరాదు.

లోపల ఉన్న వస్తువు యొక్క ఎఱుక ఎలా కలుగుతుంది అని అడుగుతూ ఉంటారు. దానికి మనస్సు అణగాలి. సత్యవస్తువు నీ హృదయంలోనే ఉంది. మనస్సు అణిగితే దాని తాలూక ఎఱుక నీకు తెలుస్తుంది. పాలసముద్రాన్ని మదిస్తే అమృతం పుట్టింది, శబ్ద ప్రపంచాన్ని మదిస్తే ఓంకారం పుట్టింది, మూలతలంపును మదించగా మదించగా, దానిని శోధించగా శోధించగా ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీకు ఇష్టమైన పదార్ధాలను తిన్నప్పుడు ఎలా ఎంజాయ్ చేస్తారో, ఇష్టమైన సినిమా చూసినప్పుడు ఎలా ఎంజాయ్ చేస్తారో అలాగ మీలోపలఉన్న ఈశ్వరుడిని ఎంజాయ్ చేయండి. లోపలఉన్న సత్యవస్తువును ఎంజాయ్ చేస్తూ ఉంటే అప్పుడు అది ఎఱుకలోనికి వస్తుంది. మనం ఎంతసేపు ప్రపంచానికి దగ్గరగా ఉంటున్నాము, ప్రపంచంలో ఉన్న వస్తువులను ఎంజాయ్ చేయాలనుకొంటున్నాము. మనకు పుణ్యబలం లేకపోవటం వలన లోపలఉన్న వస్తువును ఎంజాయ్ చేయాలనే తలంపు మనకు రావటంలేదు, దేహము నేను అనేతలంపును త్యాగం చేయటమే నిజమైనత్యాగం, అదే యజ్ఞం అదే దానం అన్నారు భగవాన్. కామక్రోధముల నుండి మనం విడుదల పొందాలి. కామ క్రోధముల నుండి విడుదల పొందాలి అనే తలంపు రావటానికి కూడా ఈశ్వరానుగ్రహం ఉండాలి.

05-09-2002

రమణ భాస్కర

డబ్బు సంపాదన కోసం, విద్య సంపాదన కోసం, సమాజంలో గౌరవం సంపాదించటం కోసం మనం చాలా కష్టపడుతున్నాము కాని ఈశ్వరానుగ్రహం సంపాదించటానికి ఎవరూ కష్టపడటంలేదు. మీ అందరి క్షేమం నేను కోరుతున్నాను అనుకోండి, మీ అభివృద్ధి కోసం నేను ప్రయత్నం చేస్తున్నాను అనుకోండి అప్పుడు ఈశ్వరానుగ్రహం తప్పని సరిగా వస్తుంది. కాని అలా ఎవరు చేస్తున్నారు? తోటిమానవుడి కోసం ఎవరు ఆలోచిస్తున్నారు? ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వరుని మనం పొందలేము. ఈశ్వరానుగ్రహం సంపాదించటానికి మనం ప్రయత్నం చేయాలి. ఎందుచేతనంటే ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వరుని మనం పొదలేము. మన మాట, చేత, ఆలోచన ఈశ్వరానుగ్రహం సంపాదించటానికి సహకరించాలి. ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తే మీకు కూడా వారిని విమర్శించాలనిపిస్తుంది. అలా విమర్శించకుండా మీరు కంట్రోలు చేసుకొంటారు అనుకోండి ఈశ్వరానుగ్రహం మీమీద వర్షిస్తుంది. ఉద్రేకపడేపరిస్థితులు ఉన్నప్పటికి మీరు ఉద్రేక రహితంగా ఉండగలిగితే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. అశాంతిని తీసుకొనివచ్చే కారణాలు ఉన్నప్పటికి మీరు శాంతిగా ఉండగలిగితే మీరు పవిత్రులవుతారు. శాంతి డ్యూరేషన్ పెరుగుతూ ఉంటే మనలో పవిత్రత పెరుగుతూ ఉంటుంది. సంకల్పాన్ని విడిచిపెట్టు అని భగవంతుడు చెపుతాడు. అంటే ఏపని చేయవద్దు అని కాదు. స్వార్ధ పూరితంగా వచ్చే మాట, స్వార్ధపూరితంగా చేసేపని విడిచిపెట్టు అంటే వాటిని త్యాగం చెయ్యి. స్వార్ధంలో నుండి విడుదల పొందితే అప్పుడు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. కొంతమంది ఎలా ఉంటారు అంటే గురువు దగ్గర ఉంటారు, ఆయనతో మాట్లాడతారు, ఆయన చెప్పినది వింటారు అక్కడతో సరి. కొంతమంది ఎలాఉంటారు అంటే గురువు చెప్పినది జాగ్రత్తగా అర్ధం చేసుకొని ఆయన దగ్గరగా ఉన్నా, లేకపోయినా దానిని ఆచరించటానికి ప్రయత్నం చేస్తారు. గురువుపట్ల మనకు గౌరవం ఉండాలి లేకపోతే ఆయన చెప్పిన మాట మనకు అర్ధం కాదు, మన గుండెకు తాకదు. శత్రువుల పట్ల, మిత్రుల పట్ల సమానభావంతో ఉండమని భగవంతుడు చెప్పాడు. అలా ప్రాక్టీసు చేస్తే ఆయన మనకు అందుతాడు. ఎవరైనా మనలను ఉద్రేకపరచినప్పడు మన ఆలోచనా స్థాయి పడిపోతుంది. అటువంటి పరిస్థితులు వచ్చినప్పడు మనం మౌనంగా ఉండటం మంచిది.

నామరూపములతో తాదాప్యం వలన అహంభావన పెరుగుతుంది. మన మాటలో, మన చేతలో నామబుద్ధి, రూపబుద్ధి పెరగకూడదు. నామబుద్ధి, రూపబుద్ధి పెంచుకొంటే స్థూలబుద్ధి పెరుగుతుంది గాని సూక్ష్మబుద్ధి పెరగదు. స్థూలబుద్ధి ఉన్నవాడికి మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది, సూక్ష్మబుద్ధి ఉన్నవాడికి మనస్సు లోపలకు వెళుతుంది. మనస్సు బయటకు వెళితే బంధం, లోపలకువెళితే మోక్షం అన్నారు భగవాన్. మనస్సు ఏ బలహీనత వలన బయటకు వెళుతోందో చూడు, ఆ బలహీనతను కట్‌చేయటానికి ప్రయత్నం చెయ్యి. ఆ బలహీనతను తొలగించుకొనే శక్తి నీకు లేకపోతే ఆ బలహీనత లేనివారితో సహవాసం చెయ్యి. వారి వైబ్రేషన్స్ నీమీద పనిచేస్తాయి. అప్పుడు ఆ బలహీనతను తొలగించుకోగలుగుతావు. నేనుఅనేతలంపు లేనిస్థితిని పొందటమే వేదముల సారం అన్నారు భగవాన్. ఇప్పుడు దేహంతో నీకు తాదాప్యం ఎలా ఉందో అలాగ నీ లోపలఉన్న బ్రహ్మంతో నీకు తాదాప్యం వస్తే అప్పుడు ఈ దేహం ఉంటే ఏముంది? దేహం లేకపోతే ఏముంది? నీ ఆనందానికి అడ్డులేదు. దేహం ఉండగా బ్రహ్మానుభవం పొందితే దేహం పోయిన తరువాత కూడా దాని తాలూక ఆనందం, శాంతి, సుఖం కంటిన్యూ అవుతుంది, ఇంక వాడికి పునర్జన్మలేదు. అహంవృత్తి ఉన్నవాడికి పునర్జన్మ కాని అహంవృత్తి నుండి విడుదల పొందిన వాడికి పునర్జన్మ ఏమిటి? వాడికి దేహం ఉన్నా ఒక్కటే, దేహం పోయినా ఒక్కటే తాను తానుగా ఉంటాడు. దేహం ఉండటం వలన వాడికి లాభం లేదు, దేహం పోవటం వలన వాడికి నష్టం లేదు. కొంతమంది గౌరవం వస్తే పొంగిపోతారు, అగౌరవం వస్తే కృంగిపోతారు, వారు ఆత్మజ్ఞానానికి అర్హులు కాదు. దేహప్రారబ్దమును బట్టి లాభం వచ్చినా, నష్టం వచ్చినా, గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా నీకువచ్చే తలంపులో నాణ్యతను పోగొట్టుకోవద్దు. బజారులో కొనుక్కునే ప్రతీ వస్తువులో క్వాలిటీ ఉందా అని చూసుకొంటారు, మరి నీకు వచ్చే తలంపుల విషయంలో క్వాలిటీ ఉండనక్కరలేదా? సర్వకాల సర్వావస్థలలో నీ పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నీ తలంపులో నాణ్యతను పోగొట్టుకోవద్దు. శాస్త్రాన్ని ప్రోపర్‌గా అర్ధం చేసుకో. సహనాన్ని ప్రాక్టీస్ చెయ్యి. అన్నీ సరి అయిపోతాయి.

అహంభావరహితస్థితిని పొందటమే గమ్యంగా పెట్టుకొని జీవించు. అహంభావరహిత స్థితిని పొందిన మరుక్షణంలో నీకు ఆత్మానుభవం కలుగుతుంది. మనం 24 గంటలు శవపూజ చేస్తున్నాము. ఇంక మనకు శివుడు ఎలా దొరుకుతాడు. మనం పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా, ఏపని చేసినా ఈశ్వరుని కృప పొందటం కోసం చేయాలి. అంతేగాని

ఇతరుల మెప్పుల కోసం చేస్తే అది తాత్కాలికం మాత్రమే. అహంభావరహితస్థితిని పొందటానికి ఏ మార్గం మంచిది అని అడిగితే మీ పద్దతిలో మీరు ప్రయాణం చేయండి, ఏ మార్గంలో ప్రయాణం చేసినా మీరు బాగుపడటం ముఖ్యం. ప్రకృతిగుణాలు దాటాక అందరూ ఒక్కటే. మనందరము శరీరాలలో తేడాగా ఉన్నాము, మనస్సులో తేడాగా ఉన్నాము, గుణాలలో తేడాగా ఉన్నాము కాని హృదయంలో ఒకటిగానే ఉన్నాము ఆ విషయం మర్చిపోవద్దు. కాని ఆ విషయం మనకు ఎందుకు అర్థంకావటంలేదు అంటే మనలో నమ్రత లేకపోవటం వలన అది మనకు అర్థంకావటం లేదు. యోగం ఎందుకు అంటే ఈశ్వరానుభవం పొందటానికి ఏ విషయాలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికే యోగం అవసరం. నీలోపల సీక్రెట్ బర్డెన్స్ చాలా ఉన్నాయి, వాటిలో నుండి బయటకు రాకుండా అమృతానుభవం ఆశిస్తావు ఏమిటి? నీ లోపలఉన్న బలహీనతల నుండి విడుదల పొందటానికి నీవుచేసే సాధన ఉపయోగ పడుతోందా? అలా ఉపయోగపడకపోతే నీవు దేని కోసం సాధన చేస్తున్నావు?

భక్తిమార్గం, ధ్యానమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఇవి అన్నీ వంతెనలు. అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి వెళ్ళటానికి ఈ మార్గాలు అన్నీ వంతెనలుగా ఉపయోగపడతాయి. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా అందులో సిన్సియారిటీ ఉంటే, డెడికేషన్ ఉంటే అన్ని మార్గములు అమృతానుభవం దగ్గరకు తీసుకొని పోతాయి. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా మూలతలంపు మూలంలోనికి వెళ్ళవలసిందే, అందులో ఐక్యమవ్వవలసిందే. మన మనస్సు, మాట, చేత ఏకంగా ఉండాలి. అలా ఉంటే మనం పవిత్రులమవుతాము. పవిత్రుడు కానివాడికి జ్ఞానసముపార్జనకు యోగ్యత లేదు. మనోనిగ్రహానికి నేనుఎవడను? అనే ప్రశ్న సహకరిస్తుంది. మీకు ఎప్పుడైనా ఉద్రేకం వస్తూ ఉంటే ఏ నేనుకు ఈ ఉద్రేకం వస్తోంది అని ప్రశ్నించుకొంటే ఉద్రేకం తగ్గుతుంది. భగవాన్ దగ్గరకు వెళ్ళి ప్రాణాయామం గురించి చెప్పేవారు. జపం గురించి చెప్పేవారు, విగ్రహారాధన గురించి చెప్పేవారు, ధ్యానం గురించి చెప్పేవారు. ఇవి అన్నీ ఆయన వినేవారు. విని ఏమనేవారు అంటే మీరు చెపుతున్నారు, మీరు చెప్పే మాటల మీద నాకు ఏమీ ఆకర్షణ కలగటం లేదే అనేవారు. మనం ఏది పొందాలో దానిగురించి తక్కువ మాట్లాడుకొంటాము, ఏది విడిచిపెట్టాలో దానిగురించి ఎక్కువ మాట్లాడుకొంటాము. నీవు ఏదిగా ఉన్నావో దానిగురించే శ్రవణం చెయ్యి, దానినే మననం చెయ్యి, దానినే జపించు. దానిని స్మరించగా స్మరించగా అదే అవుతావు. నువ్వు కాని శరీరం గురించి , నువ్వు కాని మనస్సు గురించి, నువ్వు కాని వికారముల గురించి నువ్వు స్మరించినా దాని వలన నీకు కాలం వృధా అవుతుంది, నీ శక్తి వ్యర్థమవుతుంది, నీవు కానిదానిని ఎంత స్మరించినా అది అవ్వవు ఎందుచేతనంటే అది నీవు కాదు కాబట్టి. మానవుడు దేహము నేను అనే తలంపే సర్వస్వం అనుకొంటున్నాడు. కాని గాఢనిద్రలో దేహము నేను అనే తలంపు లేకుండా ఉంటున్నాడు, పైగా అక్కడ సుఖంగా ఉన్నాడు, శాంతిగా ఉన్నాడు అది వాడు మర్చిపోకూడదు. మనం చాలాకాలం నుండి దేహగతమైన నేనే నిజం, అదే మనం అనుకొంటున్నాము, దానిని అలంకరిస్తున్నాము, భగవంతుడిని పూజించటం మానివేసి దానికి పూజచేస్తున్నాము. భగవంతుడు మనకంటే తెలివైనవాడు, మనకు ఏది మంచిదో మనకంటే ఆయనకే ఎక్కువ తెలుసు అన్నసంగతి మర్చిపోయాము అందువలన ఈ సంసారం అనే అరణ్యంలో వచ్చిపడ్డాము. ఈశ్వరానుగ్రహం లేకపోతే దేహమునేను అనే తలంపు నుండి విడుదల పొందలేము. దీనికి నీ ప్రయత్నం ఒక్కటే సరిపోదు, ఈశ్వరానుగ్రహం అవసరం. ఉదయం మెలుకువ వచ్చినది మొదలు రాత్రి పడుకొనే వరకు దేహము నేను అనేతలంపు మనస్సును రాట్నంలాగ త్రిప్పుతుంది. ఇక దానికి శాంతి ఏమిటి? అది ఒక్కనిమిషం చలనం లేకుండా ఉంటే కదా శాంతి.

3A

భరతుడు రాముడితో అంటాడు మాఅమ్మ మంచిది కాదు, మాఅమ్మ వలన నీకు అరణ్యవాసం వచ్చింది అంటాడు. రామచంద్రమూర్తి ఏమి చెప్పాడు అంటే మీఅమ్మ వలన నేను అరణ్యవాసానికి వచ్చాను అంటున్నావు, అది నీ అవగాహనలో ఉన్న లోపం, నీ అవగాహన ప్రొపర్‌గా లేదు. నా దేహం ఏ పని కోసం కౌసల్య గర్భంలో తయారయ్యిందో ఆ పని చేయటానికి ఈ దేహం అరణ్యవాసానికి వచ్చింది, మీఅమ్మవలన కాదు, మీఅమ్మ నిమిత్తమాత్రం, ఇందులో మీఅమ్మను నిందించవలసిన పనిలేదు అని చెపుతాడు. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధం ననుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. ఇది రమణస్వామి వారి అమ్మగారికి చెప్పిన బోధ. ఇది అర్థమయితే దు:ఖరహితస్థితిని పొందుతావు. నీ ప్రారబ్దాన్ని ఎంజాయ్ చెయ్యి. ప్రారబ్దాన్ని ఎంజాయ్ చేయగలిగితే పాత వాసనలు పోతాయి, క్రొత్తవాసనలు రావు, నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా దేహం ప్రారబ్దం ప్రకారం నడుస్తుంది. నీ వివేకం, నీ సూక్ష్మబుద్ధి ఎక్కడ ఉపయోగించాలంటే ఆ దేహంతో తాదాప్యం పొందవద్దు. స్థూలబుద్ధి ఉన్నవాడికి ఈ

లోకం ఒక్కటే నిజం అనిపిస్తుంది.  సూక్ష్మబుద్ధి వస్తూ ఉంటే ఈ లోకం ఎంతవరకు నిజం అని దానిని డౌట్ చేస్తాడు. నీవు నిజంగా భక్తుడివి అయితే నీవు ఇతరులను ఉద్రేకపరచవద్దు, ఇతురులు నిన్ను ఉద్రేకపరిచినా ఉద్రేకపడవద్దు, నీ ఆలోచన విడిచిపెట్టవద్దు. మీ ఇంట్లో ఎవరైనా మిమ్మల్ని తిడితే వెంటనే వారిని తిట్టాలనిపిస్తుంది.  అప్పడు కొద్దిగా కంట్రోలు చేసుకొంటే ఈశ్వరానుగ్రహం మీ శిరస్సు మీద కురుస్తుంది. ఇది చదివితే రాదు, ఆచరణ ముఖ్యం.  ధనం బాగా సంపాదించిన వాడికి భోగం వస్తుంది, మూలతలంపు మూలంలోనికి చేరిన వాడికి మోక్షసుఖం లభిస్తుంది. భోగం వలన రోగం వస్తుంది, శాంతి వలన సుఖం వస్తుంది.  నీవు మనస్సు చెప్పినట్లు చేయకు.  మనస్సు చెప్పినట్లు వింటే అది పెరిగిపోతుంది.

సద్గురు నాన్న వేంచేశారు
భక్తు లెల్లరు దర్శించండి
సుందర మూర్తిని కొలవండీ
జ్ఞాన గంగలో మునగండీ

॥సద్గురు॥

జన్మ జన్మల అనుబంధముతో
మన హృది లోనే కొలువున్నారు
ప్రవచనాలనూ అందిస్తూనే
ఆత్మ సంపదను పంచారు

॥సద్గురు॥

చిన్ని చిన్ని ప్రయత్నాల తో
ఆత్మ విచారణ చేద్దాము
నాన్న రుణాన్ని తీర్చుకుందాం
శరణా గతినే పొందుదాము

॥సద్గురు॥

"రచన" స్వరాజ్యలక్ష్మి

**05-09-2002**



మనస్సు చెప్పినట్లు చేయకుండా ఉంటే నీ మనస్సు నశిస్తుంది, మనస్సు నశిస్తే ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది.  ఈశ్వరుడి పట్ల మనకు సజీవమైన విశ్వాసం ఉంటే పరిస్థితులు అన్నీ కూడా మనకు అనుకూలం చేసిపెడతాడు.

నీ చేతిలో ఉన్న పనిని హృదయపూర్వకంగా చెయ్యి.  ఫలితాన్ని ఈశ్వరుడికి విడిచిపెట్టు, షరతులు పెట్టవద్దు, నాకు అది కావాలి, ఇది కావాలి అని కూడా భగవంతుడిని అడగవద్దు. ఆయన నీకంటే వివేకవంతుడు కాబట్టి ఏది ఎప్పడు ఇవ్వాలో ఆయనే అనుగ్రహిస్తాడు.  నీవు పూర్తిగా ఈశ్వరుడిని శరణువేడుకొంటే నీ దు:ఖం నశిస్తుంది.నీకు జ్ఞానం కావాలంటే చంటి పిల్లవాడిలాగ జీవించు.  చంటిపిల్లవాడికి రాగద్వేషములు ఉండవు.  నీవు కూడా అలా జీవిస్తే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ప్రపంచంతో అతిగా సంబంధం పెట్టుకోవద్దు.  స్నేహాలు అతిగా చేయకూడదు.  సాధ్యమైనంత వరకు మనపని మనం చేసుకొంటూ ఇతరుల వ్యవహారాలలో కలుగజేసుకోకుండా ఉండటం మంచిది.  మనుషుల మధ్య సంబంధాలు ఎక్కడ బాగున్నాయి చెప్పండి.  ఒక ఇంటిలో ఉన్న వ్యక్తుల మధ్య సంబంధం సరిగా లేదు అంటే దానికి స్వార్ధమే కారణం, మనిషిలో ఉన్న అహంభావనే కారణం.  జీవితం నుండి ఎక్కడకు పారిపోవద్దు. సాధన వేరు, జీవితం వేరు కాదు.  మీ సాధనలో జీవితాన్ని ఇన్‌వాల్వ్ చేయండి.  అప్పడు మీరు సక్సెస్ అవుతారు.  తోటివారు బాగుపడాలి అని మనం కోరుకోవటం లేదు, మనకు మటుకు ఆత్మజ్ఞానం రావాలి, ఏమి ఆలోచన ఇది?  ఈ రకంగా ఉంటే జ్ఞానం వస్తుందా? మనం ఉన్నతంగా ఆలోచిస్తున్నాము అనుకోండి, ఎవడైనా వచ్చి మన ఆలోచన తప్పఅంటే, మనలను విమర్శిస్తే సడన్‌గా మన ఆలోచనా స్థాయి తగ్గిపోతుంది.  ఇంక మనకు ఆత్మజ్ఞానం ఏమిటి?  వాడు మనకు వ్యతిరేకంగా ఉన్నా మన ఆలోచనాస్థాయి తగ్గకూడదు.  మన ఆలోచనాస్థాయి తగ్గుతూ ఉంటే మనకు ఆత్మవిశ్వాసం లేదు అని అర్థం. ఆత్మవిశ్వాసం లేనివారికి, బలహీనులలకు, బద్ధకస్తులకు ఆత్మజ్ఞానం రాదు అని కఠోపనిషత్ చెప్పింది.  భగవంతుడు నీ హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు, ఆయన పనిచేస్తున్నాడు, నీ బలహీనతలను చూపిస్తున్నాడు, వాటిని ఎలా తొలగించుకోవాలో ఆ బుద్ధిని కలుగజేస్తున్నాడు,  ఈ అజ్ఞానంలోనుండి ఎలా బయటపడాలి అని నీవు వేదన పడుతూ ఉంటే ఆ వేదన చూసి నీలోపల జ్ఞానదీపాన్ని వెలిగిస్తున్నాడు.  అంతా చేసేది ఈశ్వరుడే.  ఉన్నదే ఆయన.  ఆయనను తప్పించి మనం ఏది కోరుకొంటున్నా మనకు వైరాగ్యం లేదు అని అర్థం.

**రమణ భాస్కర**

# రమణభాస్కర

### (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-08-2002,జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు కృష్ణాష్టమి. కృష్ణుడిని స్వయంగా భగవంతుడు అంటారు. ఈ సృష్టి ఏర్పడకముందు, తరువాత కూడా ఏ చైతన్యం అయితో ఉందో అదే కృష్ణుడి రూపంలో వచ్చింది. కృష్ణుడు ఈ భూమి మీద పుట్టలేదు, పుట్టిన వానివలె కనిపించాడు. కృష్ణుడు పూర్ణావతారం, ఆయన జగద్గురువు. ఆయన భగవద్గీతను చెప్పాడు. కృష్ణుడు భగవంతుడై గీతను చెప్పాడు కాబట్టి దానిని భగవద్గీత అంటారు. విష్ణుసహస్రనామములు, భగవద్గీత మహాభారతంలో ఉన్నాయి. భారతంలో అనేక సంఘటనలు ఉన్నాయి. మానవుడు శాంతిగా ఉన్నప్పుడు ఎలా ఉంటాడు, అశాంతిగా ఉన్నప్పుడు ఎలా ఉంటాడు, కారణంలేకుండా అసూయ వచ్చినప్పుడు, వైరం పెట్టుకొన్నప్పుడు ఆ ఘట్టాలు ఎలా ఉంటాయి, మానవస్వభావాన్ని అనేక కోణాలనుండి విశ్లేషణ చేసి వ్యాసుడు మనకు చూపించాడు. దండ ఎంత పెద్దది అయినా, అందులో ఎన్ని రకాల పుష్పాలు ఉన్నా దాని కంతయు దారం అధారం. అలాగే మహాభారతంలో ఎన్నిరకాల మనుషులు కనబడినా, ఎన్ని సంఘటనలు ఉన్నా భారతం అనే దండకు ఆధారంగా ఉన్నవాడు భగవాన్ కృష్ణ. కృష్ణుడు జన్మించినది మొదలు శరీరం విడిచిపెట్టే వరకు ఎన్నో మహిమలు. భక్తి అంటే కృష్ణుడికి చాలా ఇష్టం. మనం ఏమీ కోరిక లేకుండా, స్వార్థం లేకుండా ఆసక్తి లేకుండా, ప్రయోజనం ఏమీ ఆశించకుండా కృష్ణుడిని ప్రేమిస్తే మనకు ఈ జన్మలోనే మోక్షాన్ని ఇస్తాడు. ఈ మధ్య సంగీతానికి సంబంధించిన వారు ఎవరైనా వస్తే ఎందరో మహానుభావులు, అందరికీ వందనములు అనే పాట పాడిస్తున్నాను. ఇది కాలక్షేపం కోసం కాదు. మీరందరూ మహానుభావులు అవ్వాలి. మీరందరూ యోగులు, ఋషులు అవ్వాలి. జ్ఞానం అనేది ఏ రామకృష్ణుడికో, ఏ రమణమహర్షికో, ఏ వశిష్టుడికో సొంత ఆస్తి కాదు. జ్ఞానానికి మనకు యోగ్యత ఉంది. ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పుడే ప్రకృతికి అతీతమైన, గుణాలకు అతీతమైన, నిరాకారమైన, స్వతంత్రమైన సుఖాన్ని, శాంతిని మన హృదయంలో అనుభవించాలి.

మీరు పని చెయ్యండి, ఆసక్తి పెట్టుకోవద్దు, స్వార్థం పెట్టుకోవద్దు, ఫలితం ఆశించవద్దు అని కృష్ణుడు చెపుతున్నాడు. నీ చేతులు పని చేస్తున్నప్పటికి మనస్సులో నామస్మరణ విడిచిపెట్టవద్దు. జీవించి ఉండగా నామస్మరణ విడిచిపెట్టేస్తే నీ ప్రాణప్రయాణ సమయంలో





నన్ను మర్చిపోతావు. ఇప్పుడు నీ శారీరక, మానసిక ఆరోగ్యములు బాగున్నప్పుడు నన్ను స్మరించుకొంటూ ఉంటే మరణసమయంలో కూడా నాస్మరణ నీకు ఉంటుంది, నన్ను పొందుతావు. ఇప్పుడు నన్ను స్మరించుకోకపోతే ప్రాణ ప్రయాణ సమయంలో నా స్మరణే రాదు, నా స్మరణ నీకు రాకపోతే ఎక్కడికి వెళ్ళిపోతావో? నీకు నేను గతిని, నీకు నేనే సర్వస్వాన్ని, నీకు నేనే గమ్యాన్ని అని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతుని వాక్యాన్ని నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము. భక్తి అంటే అమాయకత్వంగా ఉండమని కాదు, నీ భక్తి నిజమైతే దాని వలన వివేకం పెరుగుతుంది. నీవు శాంతిలో జీవించగలవు. సుఖానికి అమ్మ ఎవరు అంటే శాంతి. శాంతి లేకపోతే సుఖం రాదు. శాంతికి అమ్మ ఎవరు పవిత్రత, పవిత్రతలో నుండి శాంతి వస్తుంది. మనస్సుకు పవిత్రత పట్టిస్తే అందులో నుండి శాంతి ఉబుకుతుంది. శాంతిలో నుండి సుఖం ఉబుకుతుంది. ఎవరైనా నిన్ను నిందించినా, ఎవరైనా నిన్ను పొగిడినా, నీకు ఎటువంటి పరిస్థితులు ఎదురైనా నీ ఆలోచనా స్థాయి పడనివ్వకు, నువ్వు నువ్వు గా ఉండు. నీ గొడవలు ఒక ప్రక్కన పెట్టు. నేను చెప్పినది శ్రద్ధగా విను, నాయందు భక్తి కలిగిఉండు. నా మాటను ప్రాక్టీసు చెయ్యి. నాకు శరణాగతి చెయ్యి. గతి అల్లా శరణాగతే అని భగవంతుడు చెపుతున్నాడు. నేను చెప్పినట్లు నీవు చేస్తున్నావు అనుకో ఈ జన్మలో నీకు మోక్షం రాకపోయినా కంగారుపడకు. ఈ జన్మలో నీవు చేసిన సాధనయొక్క శక్తి మరుసటి జన్మలో నీకు సపోర్టుగా ఉండి మోక్షసుఖం నీకు అందేలా నిన్ను అనుగ్రహిస్తుంది. నీవు చేసిన మంచి, నీవు చేసిన సాధన వృధాపోదు, రాబోయేజన్మలో ఆధ్యాత్మికబలంగా పరిణామంలో వస్తుంది, నీవు బాగుపడతావు, నా స్వరూపమును పొందుతావు. మంచి గ్రంధాలను అధ్యయనం చేయండి, సత్పురుషులతో సహవాసం చేయండి, అందుబాటులో ఉన్న మహాత్ములను ఉపయోగించుకొని మీకు తెలియనివి అడిగి తెలుసుకోండి. ఉపనిషత్‌లలో ఉన్న బంగారపు కాసులను, వేదాలలో ఉన్న బంగారపు కాసులను ఏరి ఏరి భగవద్గీత అనే దారానికి చుట్టాడు భగవంతుడు. ఆ బంగారం మన మనస్సును, బుద్ధిని బంగారం చేస్తుంది. మీ మనస్సును జాగ్రత్తగా హేండిల్ చేసుకోవాలి, మీ మనస్సును మేనేజ్ చేసుకోవాలి. మనకు ఒక ఫ్యాక్టరీ ఉంది అనుకోండి. అందులో పనిచేసే మనుషులను జాగ్రత్తగా మేనేజ్ చేసుకొంటాము. అలాగే మీ మనస్సును కూడా జాగ్రత్తగా మేనేజ్ చేసుకొంటే ఈ జన్మలోనే మీరు మహానుభావులు అవుతారు. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. రాబోయేజన్మ ఎటువంటి జన్మ వస్తుందో మనకు తెలియదు. దారిని

పోయేవాడు చెప్పిన మాటలను ప్రమాణంగా పెట్టుకోవద్దు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని నీ జీవితాన్ని తీర్చి దిద్దుకో అని భగవంతుడు చెపుతున్నాడు. కారణంలేకుండా మనం ఉద్రేక పడతాము. మీ పిల్లల్ని మీరు శ్రద్ధగా చదివించుకోవచ్చు. అందులో పొరపాటు లేదు కానీ వారు రాష్ట్రపతి అవ్వాలి, గవర్నరు అవ్వాలి అనుకోవటం అదోరకమైన ఉద్రేకం. వారి దేహ ప్రారబ్దంలో ఉంటే అవుతారు, మీరు అనుకొంటే మాత్రం అది ఉద్రేకం. మీరు పిల్లలను కన్నారు గాని వారి ప్రారబ్దమును కనలేదు. మీరు వారిపట్ల డ్యూటీని చెయ్యండి. ఎలా చెయ్యాలి అంటే ఆసక్తిరహితంగా చేయండి. మీ పిల్లల మీద మీకు ప్రేమఉన్నా అది బయటకు కనబడకూడదు. ప్రేమ, భక్తి రహస్యంగా ఉండాలి. ఆత్మజ్ఞానం వలన వచ్చే శాంతే నిజమైన శాంతి. ఆత్మజ్ఞానం వలన వచ్చే వివేకమే నిజమైన వివేకం మిగిలినవి అన్నీ నీకు బాహ్యంగా వచ్చే గౌరవాలు, గొప్పలు, సుఖాలు అన్నీ తాత్కాలికం. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోతాయి.

కృష్ణుడు రూపాన్ని ధ్యానం చేసుకోండి. ఆయన నామాన్ని స్మరించుకోండి. ఆయన రూపాన్ని ధ్యానించటం వలన, ఆయన నామాన్ని స్మరించటం వలన మన హృదయంలో ఉన్న నామరూపరహితస్థితిని చేరుకోవటానికి ఆయన సహాయసహకారములు అందిస్తాడు. వ్యర్థమైన కోరికలు, వ్యర్థమైన చింతలు, వ్యర్థమైన కర్మలు, వ్యర్థమైన మాటలతో జీవుడు కాలక్షేపం చేస్తూ పతనమవుతున్నాడు. భగవంతుడు చెప్పిన మాటలను తీసుకొని ఇంటిదగ్గర పరస్పరం ఎవరైనా చర్చించుకొంటున్నారా? ఆ బుద్ధే అసలు మనకు లేదు. భగవంతుడు గీతలో నేను, నేను అంటాడు. అంటే అది మనం నేను నేను అనుకొనే బుజ్జిగాడు కాదు. అది విశ్వాత్మ, జీవాత్మ కాదు. ఈ సృష్టికంతయు ఏ చైతన్యం అయితే ఆధారంగా ఉందో, ఆ చైతన్యమే ఒక రూపం ధరించి చెప్పింది. అదే భగవద్గీత, తాత్కాలికమైన గౌరవాలను దృష్టిలో పెట్టుకొని సత్యవస్తువును విడిచిపెట్టుకోవద్దు. భగవంతుడు తప్పించి మిగిలినవి అన్నీ మన శరీరంతో సహా అన్నీ తాత్కాలికములే. భగవంతుడి పట్ల నీకు ఉన్న ప్రేమ నిజమైతే, భగవంతుడి పట్ల నీకు సజీవమైన విశ్వాసం ఉంటే దూడ పుట్టగానే దూడ మీద ఉన్న మాయను ఆవు ఏ విధంగా అయితే నాకుతుందో అలాగ భగవంతుడు నీలోని రాగద్వేషములను నాకుతాడు అని చెపుతారు.

నీవు ఆత్మవు, దాని స్వరూపమేసుఖం, దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఉండటం అని భగవంతుడు గీతలో చెపుతూ ఉంటే ఈ దేహమే నేను అని నేను ఎందుకు అనుకొంటున్నాను అని ఒకరు పరమాచార్యులవారిని అడిగారు, అలా అనుకోకపోతే ఈ





శరీరమనే జైలులో ఉండవు కదా, అదే మాయ. నీవు కానిదానిని నీవు అనుకొంటున్నావు. నీవు శరీరం కాకపోయినా, శరీరమే నేను అనుకొంటున్నావు, ఆ జైలులో ఉంటున్నావు. అలా అనుకోకపోతే ఎప్పుడో ఆ జైలునుండి బయటకు వచ్చి ఉండేవాడివి. కొంతమంది ఇంటి దగ్గర నాలుగు గోడల మధ్యన కూర్చొని మేము మంచివారము అనుకొంటున్నారు. మీరు నిజంగా మంచివారు అయితే మీకు ఆత్మజ్ఞానం కలగాలి కదా? ఎందుకు కలగటం లేదు? ఎవరైనా చిన్నమాట అంటే పడలేరు ఇంక మీకు ఆత్మజ్ఞానం ఎలా వస్తుంది. మీరు నిజంగా పవిత్రులయితే లోకంలో అపవిత్రత కనబడదు. మీలోపల అపవిత్రత ఉంది కాబట్టి లోకంలో అపవిత్రత కనబడుతోంది. మీ లోపల ఉన్నదే బయట కనబడుతోంది. మీరు విశ్వాసహీనులు కావద్దు, మీ విశ్వాసం ఎప్పుడూ సమానంగా ఉండాలి.

ఏనుగుకు ఎంతబలం ఉంటుందో మీ అహంభావనకు అంతబలం ఉంటుంది. ఏనుగు ఒక్క సింహానికి మాత్రమే లొంగుతుంది. అలాగే అహంభావన తొలగించుకోవటానికి నీ ప్రయత్నం అవసరమే కాని నీవు ఎన్ని ప్రయత్నాలు చేసినా గురువుఅనుగ్రహం లేకుండా నీ అహంభావన నశించదు. గురువు, చైతన్యం, ఆత్మ, బ్రహ్మం ఇవి అన్నీ ఒకే వస్తువుకు పర్యాయ పదాలు. ఉన్న వస్తువు ఒక్కటే. అది అంతటా ఉంది, నీ లోపల కూడా ఉంది. ఈ మధ్య పాలకొల్లులో ఒకరు కారు కొనుక్కున్నారు. ఆయనతో మీరు బాగా సంపాదించుకొంటున్నారు, కారు కొనుక్కున్నారు అన్నాను. బాగా సంపాదించుకొంటున్నాను, కారు కొన్నాను ఇవి అన్నీ రెండవ పక్షం, శాంతిగా ఉండేటట్లు ఆశీర్వదించండి అన్నారు ఆయన. నాకు శాంతి లేదు అనుకోండి ఈ కారు నన్నుసుఖపెట్టదు. నా సంపాదన నన్ను సుఖపెట్టదు కదా అన్నారు. నీ అహంభావన నుండి, ఈ దొంగ నేను నుండి విడుదల పొందటానికి గురువు యొక్క ఒక్క చూపు చాలు, ఒక్క మాట చాలు. జ్ఞాన నేత్రం ఒక్కసారి మీ అహంభావన వంక చూస్తే అది గజగజలాడి, గడగడలాడి దొంగనేను పత్తా లేకుండా పోతుంది. నారాయణుడే రాముడిగా వచ్చాడు అని వాలిభార్యకు తెలుసు. వాలి సుగ్రీవుడితో యుద్ధానికి వెలుతూఉంటే వాలి భార్య వాలితో చెపుతుంది. నీవు కండబలం కలవాడివే, నేను నీ భార్యను, నీ క్షేమం కోరాలి, నీకు మంచి చెప్పాలి. రాముడు అంటే దశరధుడి కుమారుడు అనుకోవద్దు, సామాన్యమానవుడు అనుకోవద్దు. నారాయణుడే ఆ రూపంలో వచ్చాడు. నీవు బలవంతుడివే అయినా ఆయన బాణం తాకింది అంటే ప్రాణం తీసేస్తుంది అని చెప్పింది. కృష్ణుడురూపంలో ఉన్నది నారాయణుడే అని భీష్ముడికి తెలుసు. భారతయుద్ధంలో ఒకరోజు భీష్ముడు బాగా విజృంభించి

యుద్ధం చేస్తూ ఉంటాడు. భీష్ముడు అలా యుద్ధం చేస్తే ఆ రోజు పాండవులు, మొత్తం సైన్యం అంతా కూడా చనిపోయేటట్లు ఉన్నారు. అప్పుడు కృష్ణుడు రధం పైనుండి ఉరికి బండిచక్రం ముక్కను పట్టుకుని భీష్ముడి వైపుకు పరిగెడతాడు. ఏమిటి కృష్ణుడు ఇలా చేస్తున్నాడు అని మనకు అనిపిస్తుంది. అర్జునుడు ఏమన్నాడు అంటే కృష్ణుడు ఆయుధం పట్టను అని చెప్పాడు, ఇప్పుడు ఆయుధం పడితే ఆయనకు అపకీర్తి వస్తుంది. అర్జునుడు బాగా యుద్ధం చేయలేదని నాకు అగౌరవం వస్తుంది అంటాడు. భగవంతునికి కీర్తి, అపకీర్తి ఏమిటి? ఇవి అన్నీ జీవలక్షణాలు. మీరు చనిపోయిన తరువాత కీర్తి ఏమిచేసుకొంటాను అంటాడు కృష్ణుడు. భీష్ముడు ఏమంటున్నాడు అంటే కృష్ణుడుచేతిలో చనిపోతే అంతకంటే నాకు ఏమికావాలి. నాకు వైకుంఠం వస్తుంది, రా అంటూ తనచేతిలో ఉన్న బాణాలు ప్రక్కన పడేస్తాడు. మీరు తీర్థాలలో గంగానదిలో, కృష్ణానదిలో స్నానాలు చేసి వస్తున్నారు. నిజమైనతీర్థం మీలోపలే ఉంది. మీ హృదయమే నిజమైన తీర్థం. అందులో స్నానం చెయ్యండి.

సత్యం నీ హృదయంలోనే ఉంది. దానికి బైటవస్తువులను అర్పించటం కాదు. దేహమునేను అనే తలంపును దానికి అర్పించు. అదే నిజమైన దానం. నీవు వ్యక్తిభావనను స్వామికి అర్పించు. లోపలఉన్న స్వామికి శరణాగతి చేస్తే నీ వ్యక్తిభావనలో నుండి విడుదల పొందగలవు. దేహాభిమానంలోనుండి విడుదల పొందాలి అనే తపన ప్రారంభమయ్యింది అనుకో, దాని కోసం నీవు ప్రోపర్‌గా ప్రయత్నం చేస్తున్నావు అనుకో ఈశ్వరుడు తన సహాయ సహకారములు పంపిస్తాడు. అర్జునా! నీ చేతులు ఆడించు పనినాది, గౌరవం నీది అంటాడు పరమాత్మ. ఇప్పుడు మనం ఎలా ఉన్నాము అంటే ఎవరో పనిచేస్తే గౌరవం మనం పొందాలి అని చూస్తున్నాము. నిమిత్తమాత్రంగా అయినా సాధన చెయ్యి, అదైనా ఒంపుపెట్టుకొని నేను కలుగజేసుకొంటాను అంటున్నాడు పరమాత్మ. సాధన ప్రారంభించండి. గురువు యొక్క అనుగ్రహం వస్తుంది. ఆ అనుగ్రహప్రవాహంలో సాధన చేసేవాడు, సాధన చేసేవాడిని అంటిపెట్టుకొని ఉన్న సంస్కారములు, నీకు జన్మలు తీసుకొని వచ్చే లక్షలాది సంస్కారములు ఎన్ని ఉన్నప్పటికి అవి అన్నీ కూడా అందులో కొట్టుకొని పోతాయి. సహృదయం ఉన్నవారి వద్ద మనకు వారి మీద ప్రేమ లేకున్నా సరదాగా కూర్చొన్నా సరిపోతుంది, వారి వైబ్రేషన్స్ మన మీద పనిచేస్తాయి, మన వాసనలు నశించబడతాయి. మనోనిగ్రహం ముఖ్యం, నమ్రత విడిచిపెట్టవద్దు. న్యూస్ పేపర్లలో వ్రాసిన మాటలు నమ్ముతాము గాని భగవంతుడు చెప్పిన మాటలు నమ్మాలని మనకు అనిపించదు. దానికి మన బుద్ధిలోని దోషం కారణం. అనేక





జన్మలు కృషి చేస్తేగాని నీవు పవిత్రుడవు అవ్వలేవు. నీవు పవిత్రుడవు అయితే గాని నీ లోపల ఉన్న ఈశ్వరుడి యొక్క వైభవం నీకు గుర్తింపుకు రాదు.చావు గొడవ నీకు ఎందుకు, పుట్టుక గొడవ నీకు ఎందుకు, పుట్టినవాడు చనిపోతాడు. చనిపోయిన వాడు తిరిగి పుడతాడు. పుట్టేది నీవు కాదు, చనిపోయేది నీవు కాదు. దేనికైతే పుట్టుక లేదో, దేనికైతే చావులేదో అదే నీవు. నీవు అక్కడ నిలబడుచాలు, నీవు ఎక్కడ ఉండాలో, ఎలా ఉండాలో అలా ఉండు సరిపోతుంది. అంతా ఈశ్వరానుగ్రహం వలన జరగాలి గాని నీ అహంకారం వలన ఏమీ కాదు. గడపకూడాదాటలేనివాడు హిమాలయాలు దాటి వెళతాను అంటే ఎలా ఉంటుందో అహంకారం చెప్పే మాటలు అలాగ ఉంటాయి. అందుచేత దానిని పట్టించుకోవద్దు, దానిని ఒక ప్రక్కన పెట్టండి. బియ్యంలో బెడ్డలు ఉంటే వాటిని ప్రక్కన పడేస్తాము. వాటితో పేచీలు పెట్టుకోము. అలాగే పనికిరాని గొడవలు ఉంటే వాటితో పేచీలు పెట్టుకోవద్దు, వాటిని ఒక ప్రక్కన పెట్టండి.

భగవంతుడు ఉంటే మాకు ఎందుకు కనిపించడు అంటారు. మీకు కనిపించటంలేదు అనిభగవంతుడు లేడు అని కాదు. ఆయన ఉన్నాడు మీ చూపుకు ఆయన కనబడడు. రెండు తలంపులు మీ కళ్లను పాడిచేస్తున్నాయి, జీవుడిని పీడిస్తున్నాయి. అవి నేను అనే తలంపు, నాది అనే తలంపు అంటే అహంకారం, మమకారం. ఈ తలంపులు మీ కళ్లను పాడిచేసి మిమ్మల్ని గుడ్డివారిగా చేస్తున్నాయి. ఈ గుడ్డివారికా లోపలఉన్నఈశ్వరుడు కనిపించేది? లోపల భగవంతుడు ఉన్నాడు. మీలో ఒకరైనా ఏ కోరిక లేకుండా ఉన్నారా? కోరికలేని భక్తి మీకు ఉంటే దానికి పొంగిపోయి భగవంతుడు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. మీలోపల ఉన్న వైభవం మీ చేతికి అందకపోవటానికి కారణం మీ చిరుకోరికే అన్న సంగతి మీకు తెలియటం లేదు. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు మీకు గోచరం అవ్వకుండా, మీరు ఆత్మసామ్రాజ్యంలో ప్రవేశించకుండా మీ చిరుకోరికే అడ్డువస్తోంది. అందువలన స్వామిని ఏమీ కోరవద్దు. ఆయననే కోరుకోండి. కృష్ణుడు సర్వదేవతా స్వరూపుడు. ఆయనకు నమస్కరిస్తే అందరు దేవతలకు నమస్కరించినట్లే. కృష్ణుడు అంటే వాసుదేవుడు గారి అబ్బాయి అని, ద్వారకలో ఉన్నాడని, కురుక్షేత్రంలో యుద్ధం చేసాడని, బృందావన విహారి అని అలా అనుకొంటున్నారు గాని హృదయంలో అంతర్యామిగా ఉన్నవాడు ఆయనే అన్నసంగతి నీకు గుర్తింపుకు రావటం లేదు. అదే మాయ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 08-09-2002 | ఆదివారం | ఆకివీడు, ఫెర్టిలైజర్ అసోసియేషన్ బిల్డింగ్, ఐ-భీమవరం రోడ్ |
| 12 9 2002 | గురువారం | భీమవరం అయ్యప్ప దీక్షామందిరం, అడ్డవంతెన దగ్గర |
| 15-09-2002 | ఆదివారం | భీమవరం, తాడిమళ్ల వారి కేంద్రం, బాలజ్యోతి కాన్వెంటు ప్రక్కన, శ్రీరాంపేట. |
| 23-09-2002 | సోమవారం | జిన్నూరు, సద్గురు శ్రీ నాన్నగారి జన్మదిన మహోత్సవము, శ్రీ రమణ క్షేత్రం |
| 29-9-2002 | సోమవారం | నర్సాపురం, వై.యన్. కాలేజ్ ఆడిటోరియం |

## సద్గురు శ్రీ నాన్నగారి 69వ జన్మదిన మహోత్సవం

| | |
|---|---|
| ఉ॥ గం॥ 6-00ల నుండి | సద్గురు దర్శనం |
| ఉ॥ గం॥ 8-00లకు | భగవాన్ పూజ శ్రీ రమణక్షేత్రంలో |
| ఉ॥ గం॥ 10-00 నుండి 12-00 వరకు | దూర ప్రాంత భక్తులకు భోజనాలు |
| మ॥ గం॥ 12-00లకు | శ్రీ నాన్నగారు ఆశ్రమంనకు రాక |
| మ॥ గం॥ 1-00లకు | శ్రీ భగవాన్ చరిత్ర తెలుగులో వీడియో ప్రదర్శన |
| మ॥ గం॥ 1-45లకు | సద్గురువుకు కమిటీ వారిచే సన్మానం |
| మ॥ గం॥ 2-00లకు | సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు |

**డబ్బుతో పాటు బుద్ధి పెరిగితే ప్రమాదం లేదు, డబ్బు పెరిగి బుద్ధి పెరగకపోతే ఆ డబ్బే వారిని నాశనం చేస్తుంది**

-సద్గురు శ్రీ నాన్నగారు

05-09-2002

### పాఠకులకు మనవి....

## రమణ భాస్కర సంవత్సర చందా రు. 150/-

సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలను అందించటానికి మేము చేస్తున్న కృషిని ప్రోత్సహిస్తున్న పాఠకులకు ధన్యవాదములు. రమణ భాస్కర ఆధ్యాత్మిక పక్షపత్రిక సంవత్సర చందా రు. 150/- లు, అయిదు సంవత్సరముల చందా రు. 700/-లు గా నిర్ణయించడమైనది. మీరు చెల్లించిన సంవత్సర చందాకు ది॥ 23-9-2002 నుండి ది॥ 23-9-2003 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు అందుతాయి. గమనించగలరు. మీరు యం.ఓ / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా.

**పెన్మెత్స శ్రీరామరాజు**
**("రమణభాస్కర" కొరకు)**
**శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265**
**ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్**

### కూపన్

ఎడిటర్ గారికి,

నేను రమణభాస్కర సంవత్సర చందా నిమిత్తం రూ॥ 150/-లు (అక్షరాలా నూటయాబది రూపాయలు మాత్రమే) యం.ఓ. / డి.డి. / నగదు పంపించుచున్నాను. క్రమం తప్పకుండా ప్రతులు పంపించగలరు. (ది. 23-9-2002 నుండి 22-9-2003) వరకు.

పేరు ..............................................................................

తండ్రి / భర్త ..............................................................................

డోర్ నెం. ................................................ వీధి / రోడ్ పేరు ................................

గ్రామం ......................................................... పిన్ కోడ్ ..................

మండలం ......................................................... జిల్లా..................

డి.డి. / యమ్.ఓ./నగదు వివరాలు ................................ ఫోన్ నెం. ..................